క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం కార్యవర్గ సభ్యులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దు



చారకొండ: నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలో జూపల్లిలో నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మొక్కల మధ్య పిచ్చి మొక్కలను తొలగించాలని, నీరు పట్టాలని సూచించారు. వాటరింగ్‌డేలో భాగంగా ప్రతి మంగళవారం తప్పనిసరిగా మొక్కలకు నీరు పట్టాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులపై తనిఖీ చేశారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ తదితరులు ఉన్నారు.

పశువుల సంత టెండర్ రద్దు చేయాలి

తెలకపల్లి: మేజర్ గ్రామ పంచాయతీ తెలకపల్లి పశువుల సంత వేలం టెండర్‌ను రద్దు చేయాలని గ్రామానికి చెందిన బొమ్మసాని శివ, భాసమోని మల్లేష్, సత్యనారాయణ ఎత్తపు శ్రీను, ఎత్తపు సాయి తదితరులు గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 26న పశువుల సంత వేలం పాటలో రూ.46.60 లక్షలకు సీల్డ్ కవర్ ప్రక్రియలో వేలం పాట టెండర్‌ను వేశారని వివరించారు. గత సంవత్సరంలో రూ.68 లక్షలు పైగా వేలం పాటను పాడారని గుర్తుచేశారు. అధికారుల కుమ్మక్కు వల్ల గ్రామ పంచాయతీకి రూ.21 లక్షలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారుల సమక్షంలో తిరిగి వేలం పాట నిర్వహించాలని వారు కోరారు.

మేకల సంతవేలం వాయిదా

చారకొండ: మండలంలోని జూపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే మేకల సంతకు 2025–26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ అధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం ఏర్పాటు చేశారు. సర్కార్ పాట రూ.6 లక్షలకు పైగా ఉండడంతో ఎవరు వేలంలో పాల్గొనలేదు. దీంతో సంత వేలంను వాయిదా వేసినట్లు ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ తెలిపారు. త్వరలో సంతవేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వనమహోత్సవం

వెల్దండ: మండలంలోని రాచూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సమీప వ్యవసాయ పొలాలకు వెళ్లి వంటవార్పు చేశారు. గాలిదేవతలకు నైవేద్యాలను సమర్పించి పశుసంపదను, పాడి పంటలను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు పిల్లాపాపలతో కుటుంబ సభ్యులు కాలక్షేమం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అర్కంటి నారయ్య, భయ్యా జంగమ్మలు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా నారయ్యకు రూ.60 వేలు, జంగమ్మ కు రూ.34 వేలు మంజూరయ్యాయి. ఇటీవల నారయ్య మృతి చెందడంతో అతని భార్య రేణుకకు, లబ్ధిదారురాలు జంగమ్మకు గురువారం జూపల్లిలో కాంగ్రెస్ నాయకులు చెక్కులను అందజేశారు. పాలాది బాల్‌రాజ్, కడారి జంగయ్య యాదవ్, సజీవ్ ఉన్నారు.

వృత్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

బిజినేపల్లి: వృత్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. రాములు అన్నారు. గురువారం పాలెం డిగ్రీ కళాశాల ఆవరణలో ఎస్‌కేఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 135 మంది నిరుద్యోగులకు రీజనింగ్ పరీక్ష నిర్వహించారు. 43 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. కంపెనీ మేనేజర్ దక్షిణామూర్తి, కో–ఆర్డినేటర్ రేణుక, సుబ్రహ్మణ్యంలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కళాశాల సిబ్బంది శ్రీనివాసులు, పద్మ, సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గౌరారంలో రోడ్డుపై కుక్కల సంచారం



తెలకపల్లిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రోజురోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. వాహనదారుల వెంట పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాహనదారులు కిందపడి ఘటనలు ఉన్నాయి.

పలు గ్రామాల్లో..

తెలకపల్లి, గౌరారం, బొప్పల్లి, ఆలేరు, రాంరెడ్డిపల్లి, కార్వంగ, అనంతసాగర్, రాకొండ, చిన్నముద్దునూరు, గౌరెడ్డిపల్లి, పెద్దూరు, పెద్దపల్లి గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో కుక్కలు కన్పిస్తే బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పలు కాలనీలో సమూహంగా సంచరించడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

గుంపులుగా సంచరిస్తూ..

మండలంలో నిత్యం ఏదో ఓ గ్రామంలో కుక్కకాటు బారిన పడుతున్నారు. గొర్రెలను, మేకలను, పశువులపై దాడి చేసి చంపివేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఇంట్లో వస్తువులను ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లినా ఘటనలు ఉన్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. రోజురోజుకు కుక్కకాటుకు గురవుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో 100కు పైగా కుక్కలు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం 10 మందికి పైగా కుక్కకాటు గురవుతున్నారు. బాధితులు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు.

నియంత్రించాలి



రోజురోజుకు గ్రామంలో కుక్కల బెడద అధికమైంది. రాత్రివేళ కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. గ్రామస్తులపై ఒక్కసారిగా దాడికి పాల్పడుతుండటంతో బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. నా కుమారుడిపై 10కి పైగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– బోయ కురుమయ్య, గౌరారం

భయంగా ఉంది



కుక్కల బెడదతో వీధుల్లో తిరగాలంటే భయంగా ఉంది. ఎప్పుడు ఎవరిమీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. విచ్చలవిడిగా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

–మల్లేష్, తెలకపల్లి

నెలకు 15 నుంచి 20 కేసులు



కుక్క కాటు బాధితులు నెలకు 15పైగా కేసులు నమోదు అవుతున్నాయి. ఒక్కోసారి 20 మందికి పైగానే బాధితులు వస్తున్నారు. కుక్కల దాడులకు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే రేబీస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి.

– సంధ్య, పీహెచ్‌సీ వైద్యురాలు, తెలకపల్లి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి



కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి సీనియర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం బార్ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్ష పదవికి న్యాయవాదులు నరేందర్ రెడ్డి, జమీల్‌లు పోటీపడగా అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి గెలుపొందారు. జనరల్ సెక్రెటరీగా మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా జయంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, ట్రేజరర్‌గా ఆంజనేయులు, లైబ్రేరియన్ సెక్రటరీగా ప్రశాంత్, ప్రెస్ సెక్రటరీగా రాంగోపాల్‌లు విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా రాంగోపాల్, జంగయ్యలు వ్యవహరించారు. గెలుపొందిని వారిని న్యాయవాదులు అభినందించారు.

అచ్చంపేటలో...



అచ్చంపేట రూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సూర్యపల్లి మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోశాధికారిగా భాస్కర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మల్లేష్, లైబ్రేరియన్‌గా కృష్ణ, మహిళా ప్రతినిధిగా సరిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



వెల్దండ: మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు గురువారం తెల్లవారుజామున ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. అనంతరం సొంతపుచీకత్తుతో నాయకులను పోలీసులు విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరంజన్, పోలే అశోక్, నాగయ్య, సాయిలు, శేఖర్, రవి, వెంకటయ్య, అంజయ్య, జగన్ ఉన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



నాగర్‌కర్నూల్ క్రైం: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద ఉన్న వాత్సల్య అనాథ బాలికల వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సక్రమంగా ఆహారం అందించకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డార్మెటరీ ఏరియా అపరిశుభ్రంగా ఉండటంలో అసహనం వ్యక్తం చేశారు. బాలికలకు ఏమైనా అసౌకర్యం కలిగితే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ చంద్రసిద్దార్థ కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఎండలు తీవ్రత కారణంగా పనులు త్వరగా ముగించాలని సూచించారు. కూలీలకు నీడతో పాటు, నీటి వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని దారారం వెళ్లే మార్గంలో ఉన్న నెమలి గుట్ట ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గురువారం తహసీల్దార్ పాండుకు పలువురు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 576లో గల గుట్టను రోజు రోజుకు ఆక్రమణకు గురవుతోందని వివరించారు. ఇప్పటికే 30 ఎకరాల భూమి వరకు ఆక్రమణకు గురైందని వాపోయారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



సారంబడతండా వద్ద మూలమలుపును పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ డీఈ, ఎస్‌ఐ

చారకొండ: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నేషనల్ హైవే డీఈ రమేష్ అన్నారు. జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై, చారకొండలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను గురువారం ఎస్‌ఐ శంషోద్దీన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోని మర్రిపల్లి, సారంబడతండా సమీపాన మూలమలుపుల వద్ద అధిక ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. ప్రమాదాల నివారణ కోసం సూచిక బోర్డులు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం పనుల స్థలంలో వేగ నియంత్రణ సూచిక బోర్డులు పెట్టాలని, రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. వారి వెంట మర్రిపల్లి మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, ఏఈ కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహనీయుల ఉత్సవాల జిల్లా కమిటీ ఎంపిక



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో గురువారం బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కమిటీని ఎంపిక చేశారు. డీఎస్‌డబ్ల్యూ, కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఎంఎస్పీ జిల్లా నాయకుడు గూట విజయ్ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. సభ్యులుగా అరుంధతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వార్డన్ చెన్నయ్య, కోళ్ల శివ, వంగూరు జయశంకర్, అంతటి కాశన్న, గడ్డం విజయ్, నల్లగంటి నాగన్న, కల్యాన్, చంద్రస్వామి, జిలకర బాలస్వామి, కంకి కురుమయ్య, మంతటి గోపి, తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం జాతీయ నాయకుడు జెట్టి ధర్మరాజు, నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలుశిక్ష

వెల్దండ: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిని వ్యక్తికి నాలుగు రోజు జైలుశిక్ష విధిస్తు కల్వకుర్తి కోర్టు జడ్జి కావ్య గురువారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి మండలం భగత్‌సింగ్‌తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను గతేడాది డిసెంబర్ 19న డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. గురువారం కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలను నడిపిన ఇద్దరికి మెజిస్ట్రేట్ జరిమానాతో జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో రెండు రోజుల కిందట నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో మండలంలోని జంగారెడ్డి పల్లికి చెందిన మల్లేష్, రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వీరన్నపల్లికి చెందిన దేవేందర్‌లు పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్షతో పాటుగా, రూ.500 ఫైన్ జడ్జి కావ్య విధించారు.

క్రీడాసామగ్రి వితరణ

తాడూరు: మండలంలోని అతారం గ్రామానికి చెందిన వేముల సుజీవన్‌రావ్ తన కుమారుడు సాయి సచిన్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పాఠశాల విద్యార్థులకు రూ.20 వేలు విలువ చేసే క్రీడా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేశగిరి దాతను అభినందించారు. ఉపాధ్యాయులు మధు, మహేష్, రమేష్, టి నరేష్, పి నరేష్, గ్రామస్తులు మధుసూదనరావు పాల్గొన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కోడేరులో హాజరైన డీలర్లు

కోడేరు: విధుల్లో రేషన్ డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్, మహేష్, జంబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీపై డీలర్లతో సమీక్ష

తిమ్మాజిపేట: వచ్చే నెల ఏప్రిల్ నుంచి ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయనున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లతో తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామకృష్ణయ్య పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు జంపాల్, డీలర్లు కృష్ణారెడ్డి, వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవులు, యాదయ్య పలువురు డీలర్లు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలతో సామాజిక రుగ్మతలు దూరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ గోవర్ధన్

నాగర్‌కర్నూల్: నాటకాలతో సామాజిక రుగ్మతలు దూరం అవుతాయని ఎస్‌ఐ కె.గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో కేసరి కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం కేసరి కళావేదిక అధ్యక్షుడు వెంకటపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పురాణ ఇతిహాసాలు, నాటకాలు, కళలు, సాహిత్యాలు సక్రమమైన మార్గంలో నడిచేందుకు దోహదం చేస్తాయన్నారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా అడ్డుకట్ట వేయొచ్చన్నారు. సీనియర్ రంగస్థల కళాకారులు విష్ణుమూర్తి, కేశవాచారి, నాగేశ్వరరావు, సాయిబాబా గౌడ్, రామకష్ణ, మల్లేశం, మల్లాజీ, పరందాములను సన్మానించారు. కార్యక్రమంలో నెలపొడుపు సాహిత్య సంస్థ గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, కవి ఎదిరేపల్లి కాశన్న సీనియర్ కళాకారులు విష్ణుమూర్తి, విజయ్, జీకే వెంకటేష్, బాస వెంకటేశ్వర్లు,, సౌభాగ్యలక్ష్మి, జయమ్మ, సంస్థ కోశాధికారి ముచ్చర్ల దినకర్, వాలీబాల్ వారియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



పెద్దకొత్తపల్లి: పట్టణంలోని మండల మహిళా సమైక్య భవనంలో గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘం సభ్యులకు సైబర్‌నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గిరి కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. 2019 నుంచి సైబర్ క్రైమ్ రేటు 60 శాతం పెరిగిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీకే డైరెక్టర్ లక్ష్మ రావు, డీసీటీయూ మల్లేష్, సఖి అడ్మిన్ సునీత, ఏపీఎం అరుణ, మండలం సమైక్య అధ్యక్షురాలు అరుణ, విష్ణు, తిరుపాల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి నియోజకవర్గ నూతన కమిటీ అధ్యక్షుడిగా పటపర్ల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబుశెట్టి నియమితులయ్యారు. గురువారం పట్టణంలోని ధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాలధరించే స్వాములు సమావేశం అయ్యారు. అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షుడు దేశ్‌పాండే గురుస్వామి సమక్షంలో నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పటపర్ల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబుశెట్టి, గౌరవ అధ్యక్షుడిగా రాంచంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి, బాలయ్య, భాస్కర్ శెట్టి, తిరుపతయ్య, సహాయ కార్యదర్శిగా చందనం శ్రీనివాసులు, కోశాధికారిగా టి.విజయ్‌గౌడ్, గుర్రం రమేష్, ప్రచార కార్యదర్శులుగా రామసుబ్బారెడ్డి, శ్రీకాంత్, నందీప్‌గౌడ్ తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో ఎన్ఆర్ఐ ఈజీఎస్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మహిపాల్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, రాజు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పశువధశాల వేలం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను పశువధశాలను వేలం వేసినట్లుగా మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో వేలం పాటను నిర్వహించారు. వేలం పాటలో ఇద్దరు పాల్గొనగా బలరాముడు రూ.5.01 లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, సిబ్బంది, టెండర్‌దారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

తిమ్మాజిపేట: యువతి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన ఓ . గ్రామానికి చెందిన బలపరి వెంకటయ్య ఈనెల 23న పనినిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంట్లో వెంకటయ్య భార్య, తమ్ముడు సంజీవ, కుమార్తె నిద్రించారు. ఉదయం లేచిచూసేసరికి కుమార్తె కనిపించకపోవడంతో తెలిసిన బంధువుల ఇళ్లలో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఐ విద్యాబోధన విద్యార్థులకు వరం



అచ్చంపేట రూరల్: ఏఐ విద్యాబోధన విద్యార్థులకు వరంలాంటిదని ఇన్‌ఛార్జీ ఎంఈఓ జీవన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నడింపల్లి పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఏఐ విద్యాబోధన తరగతులను కాంప్లెక్స్ హెచ్ఎం అర్జునయ్యతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులలో బలహీనతలు గుర్తించి వారి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఏఐ విద్యాబోధన దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్ డాక్టర్ ప్రవీణ్‌కు నివాళి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో పాస్టర్ డాక్టర్ ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించారు. అనంతరం నాగర్‌కర్నూల్ పాస్టర్స్ ఫెలోషిప్ డెవలప్‌మెంట్ చైర్మన్ జాన్ బుచ్చయ్య మాట్లాడుతూ డా: ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవుల సమాజానికి తీరని లోటన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిటీ వేసి పాస్టర్ మృతిపై అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం కాగడాలు వెలిగించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎంబీ చర్చి చైర్మన్ సంపత్ కుమార్, పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన బిజ్జ చిన్న లక్ష్మయ్య(80) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గురువారం ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నరేందర్‌రెడ్డి, సాంబశివుడుయాదవ్, కట్టా శ్రీనివాసులు, కాటం జంబులయ్య, సాకలి నర్సింహ్మ, రాముడు ఉన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

కోడేరు: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన బొల్లేందులు రాముడు, సుగుణమ్మలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఆర్మీ జవాన్ అంజి రూ.12వేలు, పెద్దకొత్తపల్లి మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య రూ.5వేలు, రాములు రూ.3 వేలు, నాగరాజు రూ.5వేలు, వెంకటస్వామి రూ.3 వేలు, రామస్వామి రూ.3వేలు అందజేశారు. అదేవిధంగా ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ, ప్రొటెక్షన్ అధికారి సుదర్శన్ చిన్నారులను పరామర్శించారు. పిల్లలను ప్రభుత్వ వసతి గృహంలో చేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లేష్, అంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేలు అందజేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాములు, సుగుణ దంపతులు ఇటీవల మృతిచెందారు. అనాథలైన పిల్లలకు ముదిరాజ్ సంఘం, మత్స్య కార్మిక సఘం ఆధ్వర్యంలో రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, బాలకృష్ణ, రాజు, రాములు, రామస్వామి, వెంకటస్వామి, స్వామి ఉన్నారు.